# 'గడప గడప'కు అపూర్వ ఆదరణ

- వెలుగోడు పట్టణంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- మూడున్నరేళ్ల సంక్షేమ పాలనను ఇంటింటా వివరించిన ఎమ్మెల్యే శిల్పా
- సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం



గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

**వెలుగోడు:** శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పట్టణంలో చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి పట్టణంలో అపూర్వ ఆదరణ లభించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ని గాంధీనగర్, మెయిన్ బజార్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్ జగన్ ప్రభుత్వం మూడున్నరేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు గోవిందు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకగా మహిళలు హారతి ఇచ్చారు. ప్రతి ఇంటి వద్ద ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వానికి తాము అండగా ఉంటామని నొక్కి చెప్పారు.

**ఎమ్మెల్యేకు సన్మానం**

బృందావన్ పాఠశాలలో విద్యార్థులు వందశాతం అమ్మ ఒడి పథకానికి అర్హులు కావడంతో ఎమ్మెల్యే శిల్పాను కరస్పాండెంట్ ఫయాజ్ అలీఖాన్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అనంతరం ర్యాలీగా ప్రధాన రహదారి వెంట బాణాసంచా పేల్చుతూ ప్రదర్శన నిర్వహించారు. వెలుగోడు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తికావడంతో పొట్టి శ్రీరాములు సెంటర్లో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకుడు, న్యాయవాది ఆసీఫ్ అలీఖాన్ గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు అమీర్ అలీఖాన్ నేతృత్వంలో ఎమ్మెల్యేను సత్కరించారు. అంతకుముందు పట్టణంలో ఫిష్ ఆంధ్ర షాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, నాయకులు తిరుపంరెడ్డి, కే.రామ్మోహన్ రెడ్డి, కే. అమీర్ అలీఖాన్, గోవిందు, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, షంషీర్ అలీ, బోగోలు సుదర్శనం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైస్ ఎంపీపీలు నసిరుద్దీన్, శంకర్ నాయక్, ఎంపీటీసీలు జనాభారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**గుంతకందాలలో ఆర్బీకే ప్రారంభం**

రైతులకు మేలుచేసే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గుంతకందాల గ్రామంలో సోమవారం రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్బీకే వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏడీఏ ఆంజనేయులు, ఏవో సునీత, డీటీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలను వివరించాలి**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందజేస్తున్న సంక్షేమ పాలనను ప్రతి గడపకు తెలియచేసేలా గృహసారథులు పని చేయాలని ఎమ్మెల్యే శిల్పా సూచించారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందచేస్తున్నారని, వాటిని ప్రజలందరికీ వివరించాలన్నారు. ప్రతి కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ. 4 లక్షల వరకు సంక్షేమ పథకాల ద్వారా అందించారన్నారు. కొత్తగా సచివాలయ పరిధిలో కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజలకు మరింత మేలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలన్నారు. వలంటీర్లు చక్కగా విధులు నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందచేస్తున్న సంక్షేమ పథకాలు చేరవేయడంలో కీలక పాత్ర వహిస్తున్నారని చెప్పారు. వలంటీర్లు, గృహసారథులు సమష్టిగా కృషి చేసి ప్రతి ఒక్కరికీ జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.


మహిళకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

## క్లుప్తంగా

### లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

**ఆత్మకూరు:** స్థానిక కోర్టులో ఈ నెల 11న నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్‌జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్‌జడ్జి రఘునాథ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కోర్టులో లోక్‌అదాలత్‌పై పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కక్షిదారులతో మాట్లాడి సామరస్యంగా చర్చించి అధిక కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాబురాజేంద్రప్రసాద్, ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఆత్మకూరు, పాములపాడు ఎస్‌ఐలు కృష్ణమూర్తి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు 'గడప గడపకు మన ప్రభుత్వం'

**ఆత్మకూరు:** మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

**నేడు నందికొట్కూరులో ..**

**జూపాడుబంగ్లా:** నందికొట్కూరు పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలోని గాంధీనగర్ కాలనీలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు మంజూరు చేసిన సంక్షేమ పథకాల వివరాలు తెలియజేయటంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు.

### నేడు గృహసారథుల సమావేశం

**ఆత్మకూరు:** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు పట్టణ, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, అంజాద్‌అలీ తెలిపారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

### తాగునీటి సమస్య పరిష్కారం


బోరుకు మోటారును బిగిస్తున్న దృశ్యం

**పాములపాడు:** మండల కేంద్రంలో ఇక తాగునీటి సమస్య తీరినట్లే. నెల రోజులుగా మోటారు మరమ్మతులకు గురికావడంతో కొంత మేర నీటి ఇబ్బందులు తలెత్తాయి. సర్పంచు మేకల బాగ్యమ్మకు విషయం తెలియజేయడంతో వెంటనే చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని సీఎస్‌ఐ చర్చ వద్ద మరమ్మతులకు గురైన పాత బోరుతో పాటు కొత్త బోరుకు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50లక్షలతో పైపులు, మోటార్లు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు.

### ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**ఆత్మకూరు:** పట్టణంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహాలు నిర్మించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గణపతి, స్వాములు, ఇస్మాయిల్, నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

**పగిడ్యాల:** ప్రజల సేవార్థం మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. ఈనెల 7న పాత ముచ్చుమర్రి, లక్ష్మాపురం–1 సచివాలయాలు, 8న పడమర ప్రాతకోట, కొత్త ముచ్చుమర్రి, సచివాలయాలు, 9న నెహ్రూనగర్ –1, లక్ష్మాపురం–2 సచివాలయాలు, 10న నెహ్రూనగర్–2,లక్ష్మాపురం–3 సచివాలయాల వద్ద మొబైల్ ఆధార్ సెంటర్లు సేవలందిస్తాయన్నారు.

### 'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

**కొత్తపల్లి:** మండల ప్రజలందరూ ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం అన్ని శాఖల అధికారులతో కలసి ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన స్పందన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**పగిడ్యాల:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భారతి స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, ఏఓ విజయ్ జ్యోతుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

**ఆత్మకూరు :** బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని బైర్లూటి వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్‌లు అన్నారు. బైర్లూటి గురుకుల పాఠశాలలో సోమవారం కిశోరబాలికల ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ రక్తహీనత రాకుండా ఉండేందుకు ఐరన్ మాత్రలు ఉపయోగించాలన్నారు. ఆహారంలో కోడిగుడ్లు, ఆకుకూరలు తప్పకుండా వినియోగించాలని సూచించారు. అనంతరం బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తులసి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లన్నకు సహస్రదీపార్చన సేవ


స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు,అధికారులు

**శ్రీశైలంటెంపుల్:** జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

### మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

**మహానంది:** శ్రీ గంగా, కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామివార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామివార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువుంచారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో జరిగిన ఉత్సవంలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.


స్వామికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు


స్వామిఅమ్మవార్ల లడ్డూప్రసాదాలు, శేషవస్త్రాలను ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి అందజేస్తున్న ఈఓ


బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు అందజేస్తున్న దృశ్యం



ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఆహ్వానపత్రికను, లడ్డూప్రసాదాలను అందజేస్తున్న ఈఓ

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని సోమవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమణలను ఆహ్వానించారు. ఈఓ ఎస్ లవన్న సోమవారం వారిని కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. వారికి శ్రీశైలదేవస్థాన అర్చక వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామివార్ల శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందజేసి సత్కరించారు.

## హుషారుగా గార్దబాల పోటీలు



జోరుగా సాగుతున్న గాడిదల పోటీలు, మొదటి బహుమతి అందుకుంటున్న పెద్దలింగస్వామి

**నంద్యాలవ్యవసాయం:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనున్న జంబులాపరమేశ్వరి ఆలయ ఉత్సవాల సందర్భంగా సోమవారం గాడిదల పోటీలు హుషారుగా జరిగాయి. ఉత్సవాల ముగింపు రోజున పందేలు నిర్వహించడం ఆనవాయితీ. పోటీల్లో నంద్యాల, ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి, వెలుగోడు, ఆత్మకూరు, మహానంది మండలాల నుంచి 15 గాడిదలు పాల్గొన్నాయి. పోటీలను ఆలయ ప్రధాన కార్యదర్శి గాండ్ల జగన్‌మోహన్, పరమేశ్వరరెడ్డి జిల్లెల్ల శ్రీరాములు ప్రారంభించారు. గాడిదలపై 120 కేజీల ఇసుక బస్తాలను వేసి 10 నిమిషాల్లో ఎన్ని అడుగుల దూరం పడిగెడుతుందనే దాన్నిబట్టి విజేతలను ప్రకటిస్తారు. మొదటి బహుమతి వేల్పనూరు పెద్దలింగస్వామికి చెందిన గాడిద 6,622 అడుగులు బరువు మోసింది. ఆ తరువాత వరుస స్థానాల్లో కామినేని పల్లె పెద్దయ్య, బాచేపల్లె నాగేష్, చిన్నవంగలి నవదీప్, కొత్తపల్లెకు చెందిన పెద్ద నరసింహులు, మిట్టపల్లెకు చెందిన వరలక్ష్మి, చిన్నవంగళికి చెందిన నరసింహులుకు చెందిన గాడిదలు నిలిచాయి. గాడిదల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు.

### నిందితులకు జరిమానా

**పగిడ్యాల:** ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐపీసీ 160, 290 సెక్షన్‌ల కింద నమోదైన ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు మరో 11 కేసుల్లో నిందితులకు నందికొట్కూరు మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు జరిమానా విధించారని ఎస్‌ఐ నాగార్జున సోమవారం తెలిపారు. ఈ నెల 11న నందికొట్కూరు కోర్టు నందు జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా 11 కేసుల్లో నిందితులైన 24 మందికి రూ.4,300 జరిమానా విధించారని పేర్కొన్నారు. అలాగే మరో 3 కేసుల్లో ఇరువర్గాలను రాజీ చేశారని వెల్లడించారు.

### మహానందిలో భక్తజనసందడి


మహానందీశ్వరుడిని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

**మహానంది:** మహానంది క్షేత్రం సోమవారం భక్తులతో కళకళలాడింది. మాఘమాసం కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించిన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయంలోని కోదండరామాలయం, ఆంజనేయస్వామి, వినాయకనంది ఆలయాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

### కైలాసద్వారం వద్ద అన్నదానం


కైలాసద్వారం వద్ద అన్నప్రసాద వితరణ చేస్తున్న దేవస్థానం అధికారులు

**శ్రీశైలంటెంపుల్:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పాదయాత్రగా వచ్చేభక్తుల సౌకర్యార్థం కైలాసద్వారం వద్ద సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణను ప్రారంభించినట్లు దేవస్థానం ఈఓ ఎస్ లవన్న తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి ఈ అన్నప్రసాదాల అందజేస్తారన్నారు. అదే విధంగా భక్తులకు మంచినీటితో పాటు బిస్కెట్లు కూడా అందజేస్తురని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య సమన్వయంతో కైలాసద్వారం వద్ద ఉచిత వైద్యశిబిరం కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

### కేసీ కెనాల్‌కు నీటి విడుదల

**గూడూరు:** సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రసుతం రిజర్వాయర్‌కు 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

## క్రీడల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ


అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

**మిడుతూరు:** స్కూల్‌గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో మిడుతూరు కేజీబీవీ విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఓ ఉమగైర్వాని తెలిపారు. రగ్బీ, పవర్ లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కర్నూలు పట్టణంలోని ఆదర్శవిద్యామందిర్‌లో రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడాపోటీలను జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహించారన్నారు. ఇందులో పాఠశాలకు చెందిన కె.భువనేశ్వరి, వి.విద్య, సురేఖ అత్యుత్తమ ప్రతిభ కనపరిచి మొదటిస్థానంలో నిలిచారని చెప్పారు. అదేవిధంగా విజయవాడ జగ్గయ్య పేటలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో మిడుతూరు కేజీబీవీ విద్యార్థి మిత్ర పాల్గొని మూడవస్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, పీఈటీ సుమలతను ఉపాధ్యాయబృందం అభినందించారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ఆత్మకూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు రణధీర్, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మోహన్ కుమార్, డీఎల్‌పీఓ కవితకు వినతిపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాబాషా, పారిశుద్ధ్య కార్మికులు సుధాకర్, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపల్లి:** అలాగే కొత్తపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు అన్నారు.సోమవారం ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు డి.స్వాములు, కార్యదర్శి హనుమంతులు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మేరి,ఈఓఆర్డీ శ్రీనివాసులునాయుడులకు వినతి పత్రం అందించారు.

**జూపాడుబంగ్లా:** జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుడు నరసింహులు ఆధ్వర్యంలో గ్రీన్‌అంబాసిడర్లు ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరికి అందజేశారు.

**మహానంది:** స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, మండల కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతికి వినతిపత్రం అందించారు.

## ఈ- క్రాప్ నమోదుపై సూపర్ చెక్


ఈ క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని సూపర్ చెక్ చేస్తున్న ఏడీఏ విజయ్‌శేఖర్

**పగిడ్యాల:** మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో ఈ–క్రాప్ బుకింగ్‌పై నందికొట్కూరు ఏడీఏ విజయ్‌శేఖర్ సోమవారం సూపర్ చెక్ చేశారు. పగిడ్యాలలోని కేసీ ఆయకట్టు కింద నల్లవాగు సమీపంలో పంటలను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వరి పంట ఆ సర్వే నంబర్లో ఉందో లేదోనని క్రాస్ చెక్ చేశారు. రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించి బయోమెట్రిక్ ద్వారా థంబ్ వేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నాగన్న, వీఏఏలు అబ్దుల్లా, వెంకటేష్, వీఆర్‌ఏలు తదితరులు ఉన్నారు.

**తప్పులుంటే సరిచేసుకోండి**

**జూపాడుబంగ్లా:** ఈ –క్రాప్ బుకింగ్‌లో తప్పులుంటే రైతులు వాటిని సరిచేయించుకోవచ్చునని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని తాటిపాడు, 80బన్నూరు, తరిగోపుల గ్రామాల్లో ఈ–క్రాప్ బుకింగ్ చేసిన ఖరీఫ్ పంటలను సూపర్‌చెకింగ్ చేశారు. ఆర్బీకేల సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రైతుల వివరాలను పొలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ–క్రాప్ బుకింగ్ చేసిన రైతుల జాబితాలను ఆర్బీకేల్లో పొందుపర్చుతారని, వాటిని పరిశీలించుకొని రైతులు చేర్పులు, మార్పులు చేయించుకోవచ్చునని చెప్పారు.

### నేడు వాహనాల వేలం

**మహానంది:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నాలుగు మోటారు సైకిళ్లు, ఒక బొలేరో, రెండు టిప్పర్ వాహనాలకు మంగళవారం వేలాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించిన యజమానులు ఉంటే సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలన్నారు. లేని పక్షంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలాలు నిర్వహిస్తామని చెప్పారు.

**నేడు బైకుల వేలం**

**బొమ్మలసత్రం:** నంద్యాల పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సరైన రికార్డులు లేకుండా పట్టుబడిన 25 బైకులకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ కృష్ణయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన రికార్డులు ఉంటే బైకు యజమానులు తీసుకెళ్లాల్సిందిగా కోరారు.

### దుండగుల దాష్టీకం

**మహానంది:** గ్రామాల్లో గుర్తుతెలియని దుండగులు చెలరేగిపోతున్నారు. గ్యాస్ సిలిండర్ల చోరీ, ఆలయాల్లో హుండీలను ఎత్తుకెళ్లడం లాంటి ఘటనలు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా సోమవారం తెల్లవారుజామున గోపవరం గ్రామంలో మాజీ సర్పంచ్ చింతం రాముడుకు చెందిన బర్రెతోకను గుర్తుతెలియని దుండగులు కోసేయడం చర్చనీయాంశమైంది. ఎవరైనా వ్యక్తిగత కక్షలతో కావాలని చేశారా, లేక మందుబాబుల పనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై మహానంది ఎస్‌ఐ నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితుడు రాముడు తెలిపారు.

## ఆకులు రాలుతున్నాయని..!


పాఠశాల ఆవరణలో చెట్లను నరికి పడేసిన దుంగలు

**పాములపాడు:** ప్రభుత్వాలు, ప్రకృతి ప్రేమికులు చెట్లను పెంచాలని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం చూస్తూ ఉంటాం. అయితే బాధ్యత గల ఉపాధ్యాయురాలు చెట్లంటే కోపమో ఏమో తెలియదు కానీ పాఠశాల ఆవరణలోని 10 భారీ వృక్షాలను నరికి వేసిన ఘటన మండలంలోని ఎర్రగూడూరు గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా రాణి ఈ ఘాతుకానికి ఒడిగట్టడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యార్థులకు నీడనిచ్చే వృక్షాలను ఎలా నరికిస్తారని గ్రామస్తులు మండిపడుతున్నారు. దుంగలను విక్రయించడానికే చెట్లను నరికించిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**శుభ్రం చేయడానికి ఇబ్బందిగా ఉంది..**

ఈ విషయం పై ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా రాణిని వివరణ కోరగా స్కావెంజర్లు శుభ్రం చేయడానికి ఇబ్బందిగా మారిందని, చెట్ల కొమ్మలు, ఆకులు ఎక్కువగా రాలుతున్నాయని చెప్పారు. పిల్లలు వాష్‌రూం వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని, ఆట స్థలం విశాలంగా ఉంటుందని చెట్లను నరికించినట్లు వివరించారు. చెట్లను నరకకూడదని మాకు కూడా తెలుసు అని చెప్పడం గమనార్హం.